నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- పాఠశాలల్లో మొక్కుబడిగా బోర్డుల ఏర్పాటు
- కానరాని మౌలిక వసతులు, ఆట వస్తువులు
- అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారుల వేడుకోలు



నడిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు



బృందావనపురంలో క్రీడా ప్రాంగణం లేని ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

నడిగూడెం : గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అందులో ఆట వస్తువులు లేకపోవడంతో పాటు సరైన స్థలాలు లేక నిరుపయోగంగా మారాయి. ఇప్పటివరకు గ్రామీణస్థాయిలో క్రీడా ప్రాంగణాలను ఏ స్థాయిలో ఉపయోగించుకున్నారు.. ఎంతమంది క్రీడాకారులను తయారు చేశారంటే శూన్యమే అని చెప్పాలి. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయించగా, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో కొంత స్థలాన్ని కేటాయించారు.కోట్లలో నిధులు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు, పట్టణాల్లో రూ.6లక్షల వరకు ఖర్చు చేయగా, ప్రస్తుతం అవి వృథాగా దర్శనమిస్తున్నాయి. సరైన సౌకర్యాలు లేకున్నాగానీ ఆ పాఠశాలలో వద్ద మొక్కుబడిగానే క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేశారు. ఎలాంటి సౌకర్యాలు లేవని పలువురు క్రీడాకారులు విమర్శిస్తున్నారు.

15గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు..

మండల కేంద్రంతో పాటు, మండలంలోని 15గ్రామాల్లోని పలు ఖాళీ స్థలాల వద్ద, ప్రభుత్వ పాఠశాలల వద్ద లక్షల రూపాయలతో తయారు చేసి బోర్డులను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కానీ పలు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా నైపుణ్యం నేర్పే వ్యాయామ ఉపాధ్యాయులు సరిపడా లేరు. దీంతో విద్యార్థులు కూడా క్రీడల వైపు మొగ్గు చూపడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి క్రీడల అభివృద్ధి కృషి చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆలయంలో శివుడిని తాకిన సూర్యకిరణాలు


శివుడిని తాకిన సూర్యకిరణాలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలోని స్వామివారి మూల విరాట్‌ను ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడారు. దశమి తిది ఆదివారం రోజున సూర్యభగవానుడు ఆయన వెలుగులను శివుడిపై ప్రసరింపజేయడంతో స్వామివారు మరింత శక్తులు తేజోమయంగా మారతాడని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న భక్తులు దేవాలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాలేయ సంబంధిత వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు


వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోదాడరూరల్ : కాలేయ సంబంధిత వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ మట్టా రాకేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల కేర్ డయాగ్నస్టిక్, స్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లివర్ పరీక్ష క్యాంపులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 120 మందికి రూ.6500విలువ చేసే వ్యాధి నిర్ధారణ, ఫైబ్రోస్కాన్, రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, డయాగ్నస్టిక్ నిర్వాహకులు ఉన్నారు.

అన్నదాన సత్రం అభివృద్ధికి సహకారం


అన్నదాన సత్రంలో అదనపు గదిని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం దాతల సహకారంతో సత్రంలో నిర్మించిన అదనపు ఏసీ గదిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్నదానం సత్రానికి పలువురు దాతలు నగదు, ప్లేట్లు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సాముల శివారెడ్డి, చౌదరి రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సాంబిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి కృషి


నియామక పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కోదాడరూరల్ : పట్టణంలో ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిల్లో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి చురుకుగా పనిచేసే వారికి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతనంగా ఎన్నికైన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు నారాయణరావు, చల్లా లక్ష్మీకాంత్, అశోక్, అనంతరాములు, రాజా తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా గోపాల్

నడిగూడెం : మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ సమావేశాన్ని ఆదివారం మండల అధ్యక్షుడు గుండు మహేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నడిగూడెం గ్రామ శాఖ యూత్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా పల్లపు గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గుండు శ్రీనివాస్, గడ్డం మల్లేష్, బాణాల నాగరాజు, చిల్లంచర్ల సత్యనారాయణ, ఆదిమళ్ల సురేష్‌కుమార్, పల్లపు శ్రీను, వల్లెపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మునగాల : స్థానిక సంస్థ ఎన్నికల్లో దివ్యాంగులకు జనాభా దామాషా ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి(బీవీహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బరాఖత్‌గూడెంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చినమాట ప్రకారం దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచి ఆర్టీసీలో 100శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి మన్మథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ నాయకులు చల్లా బ్రహ్మం, మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్, సంఘం జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు


బేతవోలులో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని బేతవోలులో ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా రూ.10లక్షలతో చేయించిన రథంలో ఊరేగింపు నిర్వహించారు. పూజారి లక్ష్మప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారిని ఊరేగింపుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇంటి ముందు అమ్మవారికి నీళ్ల పోస్తూ పూజలు చేశారు. గ్రామంలో కనకదుర్గమ్మ జాతరలో సందడి లేకపోగా ఊరేగింపుతో గ్రామంలో కొంత ఉత్సాహం, సందడి నెలకొంది. పోలీసులు అనుమతి కొన్ని ప్రధాన వీధులకు మాత్రమే ఉండడంతో అన్ని వీధుల్లోకి వెళ్లలేదని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో ఈ నెల 26, 27తేదీల్లో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే 57వ వార్షికోత్సవంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తూమల వీరస్వామి, గంధం అంజయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం దేవాలయ ఆవరణలో వార్షికోత్సవ కరపత్రాలను భక్తుల సమక్షంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. 26వతేదీ వేకువజామున 108పర్యాయములు లింగాష్టకం, రాత్రి 9.43నిలకు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న ఉదయం 8గంటలకు శివనామం ఏకాహం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన వితరణ చేయనున్నట్లు వెల్లడించారు. కాగా శివనామం, మంగళవాయిద్యాలు, శివకల్యాణం నిమిత్తం గ్రామానికి చెందిన తొగాటి వేలాద్రి -హైమావతి దంపతులు రూ.21,116ల విరాళం అందజేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

మునగాల : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన తాడువాయిలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య గ్రామంలో పలు ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామునాయిక్, కాంగ్రెస్ జిల్లా అధికారి ప్రతినిధి మాతంగి బసవయ్య, పార్టీ మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు సైదులు, నాయకులు గోపి, శ్రీను, జిల్లేపల్లి గురుస్వామి, బాలకృష్ణ, దానియేల్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దిర్శించర్ల ప్రభుత్వ పాఠశాలకు నేరేడుచర్లలోని జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్, శ్రీరామకృష్ణ ఐరన్ సిండికేట్ వారి సౌజన్యంతో రంగులు వేశారు. పాఠశాలకు రంగులు లేకపోవడంతో పాఠశాల సిబ్బంది శ్రీరామకృష్ణ ఐరెన్ సిండికేట్ యాజమాని శేఖర్‌ను సంప్రదించగా సొంత ఖర్చులతో రంగులు వేయించారు. కార్యక్రమంలో పెయింటింగ్ కంపెనీ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు


బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో ఆదివారం బొడ్రాయి వద్ద మాఘమాసం కృష్ణపక్షం మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జలాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుపులేటి వినయ్‌వర్ధన్, రమా, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష


చిలుకూరు : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

చిలుకూరు : మండల పరిధిలోని అక్షర పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో గల ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 397మంది విద్యార్థులకు గాను 389మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు తెలిపారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26విద్యాసంవత్సరానికి గాను 5వతరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 515మంది విద్యార్థులకు గాను 504మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ చింతల వాణి తెలిపారు. పరీక్షను డిపార్ట్‌మెంటల్ అధికారి సరళ పర్యవేక్షించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లి వద్ద టోల్‌గేటు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24న సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టోల్‌గేట్ పాయింట్ నుంచి 20కిలోమీటర్ల వరకు ఉన్న అన్ని రకాల ఫోర్‌వీలర్లకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. లోకల్ వాహనాలుకు సైతం టోల్ యాజమాన్యం అనుమతి ఇవ్వకుండా రుసుము వసూళ్లు చేస్తున్నారని, అందుకు నిరసనగా నిర్వహించే ధర్నాను విజయవంతం చేసేందుకు అన్ని రకాల వాహనాదారులు భారీగా తరలిరావాలని కోరారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అన్నదానంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

కోదాడరూరల్ : పట్టణంలోని శ్రీరంగాపురంలో గల అభయాంజనేయస్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలు మీద కూర్చోగా అర్చకులు స్వామివారి శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి మన్యుసూక్త విధానంతో తొమ్మిది రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, గణపతి పూజ, హనుమాన్ హోం, పూర్ణాహుతి క్రతువును నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, దాతలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏర్నేని వెంకటరత్నం బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కుర్రి గోపయ్య యాదవ్, ఉపాధ్యక్షులు మల్లు సైదిరెడ్డి, చిత్తలూరి వెంకటేశ్వర్లు, శిరంశెట్టి వెంకటేశ్వర్లు, వంగవీటి శ్రీనివాసరావు, కందుల కోటేశ్వరరావు, చిత్తలూరి శివయ్య, మల్లు నాగిరెడ్డి, వనపర్తి రామయ్య, జగన్నాథరెడ్డి తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

హుజూర్‌నగర్ : పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మాలోతు చందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో పీడీఎస్‌యూ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తానని చెప్పి గద్దెనెక్కిన తర్వాత హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులపై, విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పులి రాఖి, కామాలా ఉమేష్, ఉదయ్, శీను, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో ఆనాటి ఉపాధ్యాయులు

మునగాల : మండలంలోని కొక్కిరేణి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94విద్యాసంవత్సరంలో పదోతరగతి విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆనందంగా గడపారు. అనంతరం ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మల్‌రెడ్డి ప్రతాపరెడ్డి, ఎర్రం సీతరామిరెడ్డి, మల్‌రెడ్డి సుజాత, అనంతుల శోభ, ఆనాటి ఉపాధ్యాయులు రంగయ్య, కోటయ్య, శోభ పాల్గొన్నారు.

క్రైస్తవులు శాంతిమార్గంలో పయనించాలి


దివ్యబలిపూజ నిర్వహిస్తున్న బిషప్ ధమన్‌కుమార్

మఠంపల్లి : క్రైస్తవులు ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో పయనించాలని నల్లగొండ బిషప్ ధమన్‌కుమార్ అన్నారు. ఆదివారం జర్మనీ దేశస్థుడైన జోనస్‌ఎల్‌తో కలిసి తొలిసారిగా మఠంపల్లి శుభవార్త చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా మరియదళ మహిళా సభ్యులు, విశ్వాసులు, కోలాట దళంతో వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక తేరుపై చర్చికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిషప్ శుభవార్త చర్చిలో దివ్యబలి పూజ నిర్వహించి క్రైస్తవులకు భక్తి సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఫాదర్లు మార్టిన్, బాలశౌరిరెడ్డి, బాలరాజు, రాకేష్‌రెడ్డి, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు సమావేశం

కోదాడ : పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద ఉన్న తేజ విద్యాలయలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు రమాసోమిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలికి పుష్పగుచ్ఛం అందజేత

మోతె : బీజేపీ సూర్యాపేట జిల్లా నూతన అధ్యక్షురాలిగా నియమితులైన చల్లా శ్రీలతను ఆ పార్టీ మండల నాయకులు ఆదివారం సూర్యాపేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారిలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్య శంకర్‌నాయక్, మల్సూర్‌నాయక్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

చెరువుకట్ట మరమ్మతులు పూర్తి

- గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షానికి నారాయణపురం చెరువు కట్టకు గండ్లు
- మంత్రి ఉత్తమ్ చొరవతో మరమ్మతులకు రూ.1.95కోట్లు మంజూరు
- ఆరు నెలలుగా కట్టతో పాటు రివిట్‌మెంట్ నిర్మాణం


నారాయణపురంలో చెరువుకట్టకు పోసిన మట్టి


ఊరచెరువు కట్టకు నిర్మిస్తున్న రివిట్‌మెంట్

చిలుకూరు : మండల పరిధిలోని నారాయణపురం ఊరచెరువు కట్ట మరమ్మతులు పూర్తయ్యాయి. గత ఏడాది సెప్టెంబర్ 1న రాత్రి కురిసిన వర్షానికి చెరువు కట్టకు నాలుగు చోట్ల భారీగా గండ్లుపడి కట్ట తెగింది. దీంతో పంటలకు, ఇళ్లకు అపారనష్టం జరిగింది. వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఇరిగేషన్ అధికారులతో కలిసి నారాయణపురం చెరువును పరిశీలించి, ఇరిగేషన్ శాఖ నిధుల నుంచి చెరువు కట్ట మరమ్మతులకు రూ.1.95కోట్లు నిధులు తక్షణమే మంజూరు చేయించారు. ఆ పనులను ఆరు నెలలుగా ఇరిగేషన్ శాఖ అధికారులు దగ్గర ఉండి పరిశీలిస్తూ ముమ్మరంగా చేయించారు. దీంతో ఎట్టకేలకు చెరువు కట్ట మరమ్మతులు పూర్తయ్యాయి.

290మీటర్లు వెడల్పుతో నిర్మాణం..

వర్షానికి నాలుగు చోట్ల మొత్తం 290మీటర్ల కట్ట తెగింది. ప్రస్తుతం తెగిన నాలుగు చోట్ల 4మీటర్లు వెడల్పు. 7 మీటర్ల ఎత్తుతో 32వేల క్యూబిక్ మీటర్ల మట్టిపోసి పనులు చేశారు. చెరువు కట్ట కిలోమీటర్ 94మీటర్ల మేర ఉండగా మొత్తం మట్టి పోయించి రూలర్‌తో తొక్కించి పటిష్టంగా చేశారు. అంతేకాకుండా చెరువు కట్ట తెగిన నాలుగు ప్రదేశాల్లో రాళ్లతో రివిట్‌మెంట్ చేశారు.

నూతన అలుగు నిర్మాణానికి ప్రతిపాదనలు

చెరువు కట్ట మరమ్మతులు, కట్ట రివిట్‌మెంట్‌తో పాటు ప్రస్తుతం ఉన్న చెరువు అలుగుతో పాటు నూతనంగా మరో అలుగు నిర్మాణం చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మళ్లీ ఎప్పుడైనా భారీ వరద వచ్చినా అలుగు నుంచి నీరు సాఫీగా వెళ్లేలా ఉండాలని ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యగా 60మీటర్లతో నూతన అలుగు నిర్మాణం చేపట్టనున్నట్లు ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈ మానస తెలిపారు.

రూ.1.95కోట్లతో కట్ట మరమ్మతులు



నారాయణపురం ఊరచెరువు కట్ట మరమ్మతులు పూర్తయ్యాయి. రూ.1.95కోట్లతో 290మీటర్ల పొడవులో చెరువు కట్ట మరమ్మతులు చేపట్టాం. నాలుగు చోట్ల రివిట్‌మెంట్ కూడా నిర్మించాం. చెరువుకు భవిష్యత్‌లో భారీగా వరద వచ్చినా ఎలాంటి ప్రమాదం జరగకుండా నూతనంగా అలుగు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే అలుగు నిర్మాణం చేపడతాం.

– పి.మానస, ఏఈ ఇరిగేషన్, చిలుకూరు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చిలుకూరు : ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై సీతరాంపురం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపుకు వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీ కొట్టడంతో హుజూర్‌నగర్ వైపు వస్తున్న లారీ డ్రైవర్ చెవుల వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక్క సారిగా లారీలు ఢీ కొట్టుకోవడంతో హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపుకు వస్తున్న ఆటో అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అదే విధంగా మరో లారీ డ్రైవర్ నారాయణకుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి కానిస్టేబుల్ సలీమ్ చేరుకొని గాయాలైన వ్యక్తులను 108లో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.